# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నూతనంగా ఏర్పాటు కానున్న ఐటీ సంస్థలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు భూమి పూజ చేస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి నిర్ణయించిన 20 వేల 444 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

3. **తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల మొదటి దశలో 84.28 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.**

4. **అటల్ బిహారీ వాజ్ పేయీ సుపరిపాలనను నేటి తరానికి తెలియజేసేలా బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

5. **భారత ఆహార సంస్థకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద లక్షా 71 వేల 651 టన్నుల బియ్యం సరఫరా చేశామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో నూతనంగా ఏర్పాటు కానున్న పలు ఐటీ సంస్థలకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి భూమి పూజ చేస్తారు. ఈ సంస్థలు 3 వేల 740 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెట్టడం ద్వారా 41 వేల 700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు. అనంతరం విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకూ 9 జిల్లాల సమగ్ర అభివృద్ధి రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించనున్నారు. 9 జిల్లాల అధికారులు, మంత్రులు ప్రజాప్రతినిధులు, నిపుణులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశామని విశాఖపట్నం జిల్లా యంత్రాంగం తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి నిర్ణయించిన 26 సంస్థలకు సంబంధించిన 20 వేల 444 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర మంత్రివర్గం నిన్న ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన సమావేశంలో 44 అజెండా అంశాలకు మంత్రి వర్గం

ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి నిన్న పాత్రికేయులకు వివరిస్తూ...

వాయిస్..27 సెకన్లు

---

తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల మొదటి దశలో 45 లక్షల 15 వేలకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 84.28 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92.88 శాతం పోలింగ్ జరగ్గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యల్పంగా 71.79 శాతం ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపును ఎన్నికల అధికారులు ప్రారంభించారు. పలు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు వెల్లడించారు. మరికొన్ని ప్రాంతాలలో లెక్కింపు జరుగుతోంది. వెల్లడైన ఫలితాల మేరకు ఏకగ్రీవాలతో కలుపుకొని అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక సర్పంచి స్థానాలను గెలవగా, తర్వాత స్థానంలో భారత రాష్ట్ర సమితి నిలిచించి. పూర్తి ఫలితాలు ఇంకా తెలియాల్సివుంది.

---

ఆంధ్రప్రదేశ్ లో భారత ఆహార సంస్థకు కస్టమ్ మిల్లింగ్ రైస్ – సీఎంఆర్ కింద రికార్డు స్థాయిలో ఒక లక్షా 71 వేల 651 టన్నుల బియ్యం పంపడం జరిగిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ధాన్యం సేకరణ ప్రారంభమైన తర్వాత 15 రోజుల్లోనే ధాన్యం సేకరించి పంపించామని మంత్రి ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 3 లక్షల 24 వేల 296 మంది రైతుల నుంచి 20.65 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాల్లో 4 వేల 609.89 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వర్షాలు, తుఫాను నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడుల రాకతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డ్రోన్ – ఏరోస్పేస్ సంస్థల ప్రతినిథులు మంత్రితో నిన్న సమావేశమై పెట్టుబడి ప్రతిపాదనలు సమర్పించారు. అనంతరం మంత్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, డ్రోన్ తయారీ యూనిట్లు, ఏరో స్పేస్ పరిశ్రమల ఏర్పాటుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. రాబోయే 5 ఏళ్లలో దాదాపు 500 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు.

---

అటల్ బిహారీ వాజ్ పేయీ సుపరిపాలనను నేటి తరానికి తెలిపేలా బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో 'అటల్ – మోదీ' సుపరిపాలన బస్సు యాత్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. వాజ్ పేయీ శతజయంతి వేడుకల సందర్భంగా ఈనెల 25 వరకు యాత్ర కొనసాగుతుందని ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా జరిగిన జీరో అవర్ లో పత్తి రైతుల సమస్యలపై ఆయన నిన్న ప్రసంగించారు. పత్తి కొనుగోలుకు సంబంధించిన నిబంధనలను సరళతరం చేయాలని శ్రీకృష్ణ దేవరాయలు కోరుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

రెండవ దశ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-సర్ కు సంబంధించిన గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ సహా అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ గడువును పొడిగించింది. తమిళనాడు, గుజరాత్‌లలో ఈనెల 14వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు ఈనెల 18వరకు, ఉత్తర్ ప్రదేశ్‌లో ఈనెల 26 వరకు గడువు పెంచుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీటికి అనుగుణంగా సవరణ జాబితా ప్రచురణ తేదీలు కూడా మార్చి నట్లు వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత మరింత పెరిగింది. ఉభయ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు పొగ మంచు కురుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మినుములూరులో కనిష్ఠంగా 4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవ్వగా తెలంగాణలోని కుమురం భీం ఆసిఫాబాద్‌లోని గిన్నెధరిలో 5.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైయింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో హస్త కళలకు మరింత ప్రోత్సాహం అందించనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జాతీయ హస్త కళల వారోత్సవాల్లో భాగంగా భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024కు సంవత్సరాలకు ప్రకటించిన పురస్కారాలో రాష్ట్రానికి చెందిన అయిదుగురు కళాకారులు అవార్డులు అందుకోవడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. హస్తకళా రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, కళాకారులకు శిక్షణతో పాటు ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందని అన్నారు. జాతీయ హస్త కళల వారోత్సవాల్లో భాగంగా అవార్డు గ్రహీతలను ఈ నెల 13న శ్రీకాళహస్తిలో సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వంద మంది హస్త కళాకారులకు ఒక్కొక్కరికీ 10 వేల రూపాయల కిట్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

---------------------------

యువ పరిశోధకులు అంతర్‌శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి సారించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. "దక్షిణ భారతదేశ నాణేలు-ఆర్థిక వ్యవస్థ" అనే అంశంపై వారసత్వ శాఖ, జాతీయ నాణేల సంస్థ-ఎన్ఎస్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు.

====================